పొలంలో కాలిబాటలు.. వరి పైరుకు మేలు

- వరిలో కాలిబాటల ప్రయోజనాలపై వ్యవసాయాధికారుల విస్తృత ప్రచారం
- అపోహలు విడనాడి కాలిబాటలు ఏర్పాటు చేస్తున్న రైతులు

గణపవరం : ప్రస్తుతం రబీ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. దాదాపు రైతులంతా వరినాట్లు వేయడానికి పొలాలను దదును చేసి, సిద్ధం చేసుకున్నారు. వరినాట్లు వేసే సమయంలో రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వరినాట్లు వేసే సమయంలో రైతులు పొలంలో కాలిబాటలు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు. పొలంలో కాలిబాటలు నిర్మించడంవల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరిస్తున్నారు. అయితే చాలా మంది రైతులు కాలిబాటలు వేయడంపై అంతగా ఆసక్తి చూపడం లేదు. దీనికి కారణం అదనంగా ఖర్చులు, కాలిబాట మార్గంలో వరినాట్లు తొలగించడం వల్ల దిగుబడి తగ్గుతుందన్న అపోహతో కాలిబాటల ఏర్పాటుకు దూరంగా ఉంటున్నారు.

వరి దుబ్బులకు సక్రమంగా ఎరువులు, పురుగు మందులు

నాట్లు వేసిన పొలంలో ప్రతి రెండు మీటర్ల దూరంలో కాలిబాటలను వేయడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. కాలిబాటలు వేయడం వల్ల వరి మొక్క వేరు భాగానికి గాలి, సూర్యరశ్మి బాగా తగలడం వల్ల చీడపీడల సమస్య తగ్గుతుంది. ఎరువులు, పురుగు మందులు చల్లడానికి అనువుగా ఉంటుంది. కాలిబాటల వెంబడి తిరుగుతూ ఎరువులు, పురుగు మందులు చల్లడం ద్వారా ప్రతి వరి దుబ్బుకు ఎరువులు, పురుగు మందును అందించడానికి అనువుగా ఉంటుంది. తద్వారా ఎకరాకు మూడు నుంచి నాలుగు బస్తాల మేర అదనంగా దిగుబడి సాధించే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే గతంలో రైతులు అదనపు వ్యయం అవుతుందన్న కారణంగా వీటిపట్ల ఆసక్తి చూపేవారు కాదు. వ్యవసాయ సిబ్బంది కాలిబాటల వల్ల ప్రయోజనాలు రైతులకు వివరించడంతో ఇటీవల కాలి బాటలు వేసే రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. చాలామంది రైతులు నాట్లు వేసే సమయంలోనే లైన్‌తాడును ఉపయోగించి కాలిబాటలను ఏర్పాటు చేస్తున్నారు.


వరిచేనులో ఏర్పాటుచేసిన కాలిబాటలు

కాలిబాటలు వేసే విధానం

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా కొబ్బరి తాడు తీసుకుని చేను గట్టుకు ఒకవైపు నుంచి మరోవైపు గట్టుకు తాడును బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్ల వెడల్పున ఉన్న వరినాట్లు తొలగించాలి. ఈనాట్లు పొలంలో పల్చగా ఉన్న వేరే ప్రాంతాలలో నాటుకోవచ్చును. వెద జల్లే పద్ధతిలో సాగుచేసేవారు విత్తనాలు చల్లిన 15 రోజుల నుంచి 20 రోజుల వ్యవధిలో వరిమొక్కలను తొలగించి కాలిబాటలు వేసుకోవాలి.

కాలిబాటల వల్ల ప్రయోజనాలు

కాలిబాటలు వేయడం వలన వరిదుబ్బుల మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగలడంవలన పైరు ఆరోగ్యవంతంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకూ తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తే సులభంగా గుర్తించడానికి, ఎలుకల నివారణకు, ఎరువులు, పురుగు మందులు చల్లుకోవడానికి అనువుగా ఉంటుంది. తుఫాన్‌లు, భారీ వర్షాలు వంటి పకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా కాలిబాటలు ఉపయోగపడతాయి.


నాట్లువేసిన పొలంలో కాలిబాటలు వేస్తున్న రైతు

కాలిబాటలు పైరు ఎదుగుదలకు దోహదం



రైతులు పొలంలో కాలిబాటలు తప్పనిసరిగా వేసుకోవాలి. దీని వల్ల రైతులకు లాభమే తప్ప ఎలాంటి నష్టం ఉండదు. ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి ఇద్దరు కూలీలకు రూ.800 నుంచి రూ.1000 వరకూ ఖర్చు అవుతుంది. అయితే వీటివల్ల నాలుగైదు బస్తాల అదనపు దిగుబడి రావడమేకాక, కలుపు మొక్కల తొలగింపు, చీడపీడలను సకాలంలో గుర్తించడం, సస్యరక్షణ చర్యలు తీసుకోవడం, ఎలుకల వల్ల కలిగే నష్టాన్ని తగ్గించడం వంటి ఉపయోగాలు న్నాయి. వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు పొలంలో కాలిబాటలు వేసేలా ప్రోత్సహిస్తున్నారు.

– యర్రంశెట్టి ప్రసాద్, ఏవో, గణపవరం

కుల గణన సర్వేలో దోషాలను సరిచేయాలని వినతి


ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవికి వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్

భీమడోలు : హిందూ మాలగా ఉన్న వారిని క్రైస్తవ మాలగా సర్వేలో నమోదు చేసారని, దీనితో చాలామంది ఎస్సీ రిజర్వేషన్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని, కుల గణన సర్వేలో సచివాలయ సిబ్బంది తప్పులు చేసారని, వాటిని సరి చేయాలని సోమవారం భీమడోలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భీమడోలు ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవికి వినతి పత్రం అందించారు. ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా చాలామంది భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, సర్వేలో నమోదైన కుల జాబితాలను తమకు అందజేయాలని, తప్పులుంటే ఉన్నతాధికారులు సరిదిద్దుకునే వెసులుబాటు కల్పించాలని ఆయన కోరారు. అనంతరం ఎంఆర్‌పీఎస్ నాయకులు కొత్తపల్లి చంద్రమౌళి, కాటూరి జోగేశ్వరరావు, ఉండి నాగరాజు మాట్లాడుతూ మాదిగ హిందూగా నమోదు కావాల్సి ఉండగా మాదిగ క్రైస్తవుడిగా నమోదు చేశారని, దీని వల్ల మాదిగలు బీసీలుగా మారే అవకాశాలున్నాయని, అధికారులు తప్పులపై దృష్టి సారించి సవరించాలని కోరుతూ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసారు. పలు గ్రామాల నుంచి పలువురు దరఖాస్తులు, ఫిర్యాదులు చేసారు.

క్లుప్తంగా

శివాలయంలో వైభవంగా లక్ష బిల్వార్చన


భీమడోలు శివాలయంలో స్వామి వారికి లక్ష బిల్వార్చన పూజలు చేస్తున్న అర్చకులు

భీమడోలు: భీమడోలులో వేంచేసియున్న దేవాదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి మాస శివరాత్రి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి ఉమాశంకర్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం భక్తుల ఆర్థిక సాయంతో ఈ ఉత్సవాన్ని కన్నుల వేడుకగా నిర్వహించారు. స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, రుద్రహోమం తదితర విశేష పూజలు చేసారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ శాంతి కల్యాణం నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామి వారిని సుందరంగా ముస్తాబు చేసారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసారు.

భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు


దొంతవరంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: దొంతవరంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్.పోతురాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ప్రజల నుంచి రెండు అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దొంతవరం సర్పంచ్, ప్రజలు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఉంగుటూరు మండలం రావులపార్రులో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు డిప్యూటీ తహసీల్దార్ తెలిపారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

గణపవరం: సమాజంలో శాంతి సౌభాగ్యాలు నెలకొనడానికి అందరూ క్రీస్తు బోధనలు ఆచరించాలని పలువురు అన్నారు. సోమవారం గణపవరం మండలం పిప్పరలో సామాజిక సేవకుడు కొలనువాడ సుబ్బరాజు ఇంటివద్ద నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పలువురు పాస్టర్లు క్రీస్తు సందేశాలను వివరించారు. ఈ సందర్భంగా కేకు కోసి క్రైస్తవ సోదరులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి.హరికుమార్ రాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరులో ప్రజాదర్బార్

ఉంగుటూరు: సమస్యల పరిష్కారానికి మంగళవారం ప్రజావాణి నిర్వహించనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉంగుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనే ఈ ప్రజా వాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం


ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి, తహసీల్దార్ బి.రమాదేవి

భీమడోలు: రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని భీమడోలు మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. కోడూరుపాడు, దుద్దేపూడిలో సోమవారం మీ భూమి– మీ హక్కుపై గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు సర్పంచులు మానుకొండ నాగేశ్వరరావు, నీలం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌వీ నాగరాణి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేలో గుర్తించిన తప్పులను సరి చేసేందుకు అన్ని చర్యలు చేపడతామన్నారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ గతంలో పైలెట్ ప్రాజెక్టుగా ఈ గ్రామాలను ఎంపిక చేసి భూసర్వే నిర్వహించామన్నారు. 18 మంది రైతులు ఫిర్యాదు చేయగా వాటిలో ఒకటి మాత్రమే పరిష్కరించారు. భూ సర్వేను ఇష్టానుసారంగా చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. అనంతరం పలు ధ్రువీకరణపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కిరణకుమారి, మండల సర్వేయర్ ధర్మారావు, ఎంపీటీసీ పొల్నాటి శ్రీను, వీఆర్వో సోమయ్య, కార్యదర్శి ధర్మా, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి


పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో 1996లో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సోమవారం ఆహ్లాదపూరిత వాతావరణంలో జరిగింది. పిల్లెం శ్యామ్ తంబి, కృష్ణాజీ ఇతర విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు గుల్ల ప్రసాద్, జి సాంబశివరావు పూలదండలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా ఫొటో దిగి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. సాయంత్రం వరకూ ఉల్లాస పూరిత వాతావరణంలో వారంతా ఆనందంగా గడిపారు తొలుత విద్యార్థి నాయకులు శ్యామ్ తంబి, కనకరాజు, కృష్ణాజీ మాట్లాడుతూ వేలాదిమందికి విద్యాబుద్ధులు నేర్పించిన దాత గారపాటి హైమావతి దేవి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేయడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నారు.

ఆకట్టుకున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు


నిడమర్రు: మండల స్థాయి సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్న ఎంఈవో భాస్కర్


భీమడోలులో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, న్యాయనిర్ణేతలు

భీమడోలు: విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల విద్యా వైజ్ఞానిక సదస్సు ఆకట్టుకుంది. మండల పరిధిలోని భీమడోలు, గుండుగొలను, పూళ్ల, కురెళ్లగూడెం, ఆగడాలలంక, పోలసానిపల్లి ఉన్నత పాఠశాలలు, యూపీ పాఠశాలలకు చెందిన బాలబాలికలు వ్యక్తిగతంగా, గ్రూపు విభాగంలో, టీచర్లు ఉత్సాహంగా పాల్గొని వివిధ సబ్జెక్టులకు చెందిన ప్రాజెక్టులను తయారీ చేసి మండల స్థాయి వైజ్ఞానిక సదస్సులో ప్రదర్శించారు. ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ ప్రదర్శనను పరిశీలించారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలు ఎంపిక చేసారు. గణితంలో పోలసానిపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని వి.వినీల (10వ తరగతి) తయారు చేసిన త్రికోణమితి వినియోగం ప్రాజెక్టుకు మండలస్థాయిలో ప్రథమంగా నిలవగా, గైడ్ టీచర్‌గా కె.పాతమ్మ వ్యవహరించారు. ఫిజిక్స్‌లో భీమడోలు ఉన్నత పాఠశాలకు చెందిన ఎంబీ ప్రసన్నకుమార్ (9) అగ్నిపర్వత విస్ఫోటనం నుంచి గ్రామాన్ని రక్షించుకోవడంపై రూపొందించిన ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి గైడ్ టీచర్‌గా జే.అనిల్ వ్యవహరించారు. గణితంలో గ్రూప్ విభాగంలో పి.స్నేహ గీతిక, వి.అమృత తయారీ చేసిన ప్రాజెక్టుకు ప్రథమ స్థానంలో నిలిచింది. గైడ్ టీచర్‌గా ఎండీ హసీనాబేగం వ్యవహరించారు. గణిత టీచర్ ఎండీ హసీనా బేగం ప్రథమంగా నిలిచారని ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. వారంతా జిల్లా స్థాయిలో విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు సిద్ధంగా కావాలని కోరారు. హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఆహ్మద్, ఉపాధ్యాయులు సీతారామయ్య, గౌరీ, సీఆర్‌ఎంటీ రమణ, రాధాకృష్ణలు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.


పెదపాడు: జెడ్పీ ఉన్నత పాఠశాలలోని వైజ్ఞానిక ప్రదర్శన

పత్తేపురం జెడ్పీస్కూల్ విద్యార్థుల ప్రతిభ

నిడమర్రు: దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(ఎస్ఐఎస్ఎఫ్)–2025 సందర్భంగా నిడమర్రు గాదిరాజు గోపాలకృష్ణంరాజు జెడ్పీస్కూల్లో సోమవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ పోటీల్లో పత్తేపురం జెడ్పీ స్కూల్ సత్తాచాటి 3 విభాగలకు 2 విభాగాల్లో ఆ స్కూల్ విద్యార్థులు, టీచర్స్ తయారు చేసిన సైన్స్ ప్రాజెక్ట్‌లను జిల్లాస్థాయికి ఎంపిక చేసారు. గ్రూప్ కేటగిరిలో పత్తేపురం స్కూల్ విద్యార్థులు హేమంత్ సాయి, హర్షిత్ వర్మ తయారు చేసిన విద్యుత్ అయస్కాంత అనువర్తనాల మోడల్, టీచర్ కేటగిరిలో అదే స్కూల్ సైన్స్ టీచర్ కె. సుబ్బరాజు తయారు చేసిన అండర్ గ్రౌండ్ డ్రిప్ సిస్టమ్ ప్రాజెక్టు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో ఏవీఎస్ఎన్ భాస్కర్ కుమార్ తెలిపారు. వ్యక్తిగత విద్యార్థి విభాగంలో నిడమర్రు జెడ్పీ స్కూల్‌విద్యార్థి సీహెచ్ ఏసు తయారు చేసిన వాటర్ కూలర్ జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లుతెలిపారు. మండలంలోని జెడ్పీ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఉంగుటూరు: మండలస్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్లో నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాల్లో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎగ్జిబిట్‌లను ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలువురు ప్రముఖులు పరిశీలించి, విద్యార్థులను అభినందించారు.

పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

పెదపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో పెదపాడు మండలంలోని అప్పనవీడు, పెదపాడు, వసంతవాడ, సత్యవోలు, వీరమ్మకుంట, పాతముప్పర్రు, కొత్తూరు, వట్లూరు, సోషల్ వెల్ఫేర్ వట్లూరు, కలపర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వాటిలో ఉత్తమ ప్రదర్శనలను జిల్లా స్థాయిలో నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు ఎంఈవో డీవీ రమణ తెలిపారు. సోషల్ వెల్ఫేర్ వట్లూరు, జెడ్పీహెచ్ఎస్ పెదపాడు, వట్లూరు, కొత్తూరు, అప్పనవీడు విద్యార్థుల ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు ఎంఈవో తెలిపారు.

అసత్య ప్రచారాలు నమ్మొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల మేనేజ్‌మెంట్

దెందులూరు: విద్యాబోధనలో నూతన టెక్నాలజీని అనుసంధానం చేస్తూ అభివృద్ధి చెందుతున్న దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధి వేగవరంలో ఉన్న హేలాపురి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కాలేజీలో ఆర్థిక అవకతవకలు జరిగాయని జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని చైర్మన్ ఈవీ రమేష్ తెలిపారు. సోమవారం కాలేజీ ఆవరణలో కార్యదర్శి అట్లూరి శ్రీనివాస్, ట్రెజరర్ ఎం వెంకయ్య, ప్రిన్సిపల్ లావణ్య, ఏవో కరుణానిధితో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల నగదు కాలేజీలో కొంతమంది వాడేసుకున్నారని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కాలేజీ మేనేజ్‌మెంట్ మాట్లాడుతూ కొన్ని సోషల్ మీడియాలో గ్రూపుల్లో కొంతమంది పనిగట్టుకుని మంచి పేరు ఉన్న కాలేజీ ఉన్నతిని, అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశ్యంతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రచారం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస దీపారాధన


స్వామివారికి హారతి ఇస్తున్న యువతులు

దెందులూరు: ధనుర్మాసం పురస్కరించుకుని సోమవారం దెందులూరు శ్రీ విష్ణు ఆలయంలో 15వ రోజు యువతులు దీపారాధన చేశారు. ఆలయ అర్చకుడు భట్టాచార్య స్వామి వారికి ప్రత్యేకాలంకరణ చేశారు. కన్యలు స్వామివారికి హారతులు ఇచ్చి ధనుర్మాస పూజలు నిర్వహించారు.

ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అమావాస్య పూజలు


ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అడవికొలను ప్రసన్నాంజనేయ స్వామి

నిడమర్రు: అడవికొలనులోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం సోమవతి అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చక్రవర్తుల సుబ్బారావు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే అమావాస్య సోమవారం రోజున రావడంతో దీన్ని సోమవతి అమావాస్య అంటారన్నారు. ఈ రోజు చేసే పూజలతో భక్తులకు మంచి ఫలితాలు అందుతాయన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి తమలపాకులు, అప్పాలు వంటి వాటితో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుల ఆత్మహత్యలపై ప్రభుత్వం స్పందించాలి

దెందులూరు: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం దుద్దికుంటలో కొమ్మెర నాగేంద్ర అనే రైతు కుటుంబం (నలుగురు) మొత్తం సామూహిక ఆత్మహత్యకు పాల్పడి మరణించిన ఘటన ప్రతి ఒక్కరినీ కంట తడిపెట్టిస్తోందని కాని ఈ ఘటన ప్రభుత్వాన్ని కదిలించలేకపోవడం శోచనీయమని ఏపీ రైతు సంఘం నాయకులు అన్నారు. సోమవారం దెందులూరులో రైతు ఆత్మహత్యలపై ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో నష్టాలతో ఏలూరు జిల్లాలో, రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

పెదపాడు: పార్లమెంటు సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ తెలిపారు. పెదపాడు బల్లరేవుతూము సెంటర్‌లో సీపీఎం నాయకులు సోమవారం నిరసన వ్యక్తం చేసారు. పార్టీ కార్యదర్శి గుండపనేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.